సాక్షి ఒడిశా

శుక్రవారం । 13 । జనవరి । 2023

I




శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,98,657 లు, బంగారం 590 మిల్లీ గ్రాములు, వెండి 56 గ్రాముల 150 మిల్లీ గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



యువతకు ఆదర్శనీయుడు స్వామీ వివేకానంద

- IIలో▸



జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- IIలో▸

న్యూస్‌రీల్

అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

బరంపురం: స్థానిక ప్రేమనగర్ 3వ లైన్‌లో ఉన్న శంకర్ పాలసీ అపార్ట్‌మెంట్‌లో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఐఐసీ అధికారి కులమణి సెఠి తెలిపిన వివరాల మేరకు.. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదంలో అపార్ట్‌మెంట్‌లో ఉన్న 308వ ఫ్లాట్ పూర్తిగా దగ్ధమైయింది. సమాచారం అందుకున్న బరంపురం అగ్నిమాపక సుమారు 3 గంటల పాటు తీవ్రంగా శ్రమించి మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది అనుమానిస్తున్నారు.

కళాశాల వేడుకలకు సీఎం నవీన్



విక్రమదేవ్ కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

జయపురం: ఈనెల 31వ తేదీన జరగనున్న స్థానిక విక్రమదేవ్ అటానమస్ కళాశాల ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాల్లో సీఎం నవీన్ పట్నాయక్ పాల్గొంటారని ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి తెలియజేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, కొరాపుట్ జిల్లా కలెక్టర్ అబ్దుల్ మహమ్మద్ అకతార్, ఎస్పీ అభినవ సోన్‌కార్ తదితరులు కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా సీఎం రాక సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. వారితో పాటు మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, ఆర్‌అండ్‌బీ ఇంజినీర్ భాస్కర చంద్ర సామంతరాయ్ తదితరులు ఉన్నారు.

17 నుంచి ప్రైవేటు బస్సుల సమ్మె

భువనేశ్వర్: ఈనెల 17వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపట్టనున్నట్లు రాష్ట్ర ప్రైవేటు బస్సు యజమానుల సంఘం గురువారం ప్రకటించింది. కొత్తగా ప్రవేశపెట్టిన స్క్రాప్ చట్టం, పలు ప్రైవేటు బస్సు యాజమాన్యాలపై చర్యలకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూనియన్ ప్రధాన కార్యదర్శి దేవేంద్ర సాహు తెలిపారు. సమ్మెపై గత నెలలోనే రాష్ట్ర ప్రైవేటు బస్సు యజమానుల సంఘం రాష్ట్ర రవాణా శాఖ కార్యాలయం ఎదుట నిరసనలు చేపట్టింది. ప్రధానంగా ఎనిమిది అంశాలను సంఘం ప్రభుత్వం ముందు ఉంచింది. అయితే వారి డిమాండ్లను నెరవేర్చకపోవడంతో సమ్మె నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కటక్ జిల్లా ప్రైవేట్ బస్ ఓనర్స్ అసోసియేషన్ సమ్మెకు మద్దతు ప్రకటించింది.

హెచ్‌ఎస్‌ఆర్‌పీ లేకుంటే జరిమానా

భువనేశ్వర్: మోటారు వాహనాలకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ (హెచ్‌ఎస్‌ఆర్‌పీ) లేకపోతే ఈనెల 15వ తేదీ నుంచి జరిమానా తప్పదని అదనపు రవాణా కమిషనర్ లాల్ మోహన్ సెఠి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సుమారు రూ.5,000 నుంచి రూ.10,000 వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. నిర్ణీత సమయం తర్వాత హెచ్‌ఎస్‌ఆర్‌పీ లేకుంటే భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

పర్లాకిమిడిలో మంత్రి శ్రీకాంత్ సాహు పర్యటన



మంత్రి శ్రీకాంత్ సాహును ఆహ్వానిస్తున్న అధికారులు, నాయకులు

పర్లాకిమిడి: రాష్ట్ర కార్మిక, ఉద్యోగుల ఇన్సూరెన్సు శాఖ మంత్రి శ్రీకాంత్ సాహు గురువారం మధ్యాహ్నం స్థానిక సర్క్యూట్ హౌస్‌కు విచ్చేశారు. ఆయనను ఎంపీ చంద్రశేఖర సాహు, కలెక్టర్ లింగరాజ్ పండా, బీజేడీ జిల్లా అధ్యక్షుడు ప్రదీప్ నాయక్, కాశీనగర్ బీజేడీ అధ్యక్షుడు రొక్కం రాంప్రసాద్, మహిళా అధ్యక్షురాలు పూర్ణబాసి నాయక్, ఏడీఎం సంగ్రాం శేఖరపండాలు స్వాగతించారు. అనంతరం బ్లాక్‌స్థాయి గజపతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అక్కడి నుంచి ఆర్.ఉదయగిరి, మోహనా బ్లాక్‌స్థాయిలో జరుగుతున్న గజపతి ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

సమైక్యతకు అద్దం..

చౌయితి ఉత్సవం



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న ట్రాన్స్‌జెండర్లు



ట్రై సైకిల్ పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులు



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు



ఉత్సవాల నిర్వాహకులతో ట్రాన్స్‌జెండర్లు

జిల్లా కేంద్రంలో చౌయితి ఉత్సవాలు సమైఖ్యతకు అద్దం పట్టేలా నిర్వహించనున్నట్లు వక్తలు పేర్కొన్నారు. ఈనెల 18వ తేదీన స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ నేపథ్యంలో క్రీడాకారులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నారు. స్థానిక కొత్త బస్టాండ్ వద్ద దివ్యాంగుల ట్రై సైకిల్ పోటీలను ఎమ్మెల్యే మకరంద ముదులి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఏడాది కలసికట్టుగా ఈ ఉత్సవాలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది సైతం అత్యంత ఘనంగా ఈ ఉత్సవాలను నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. అలాగే ట్రాన్స్ జెండర్ల మధ్య కబడ్డీ పోటీలు, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శిశిర్ రాహుల్, కార్యదర్శి అమరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

– రాయగడ

గంజాయి పంట ధ్వంసం



గంజాయి చెట్లు ధ్వంసం చేస్తున్న పోలీసులు

బరంపురం: గంజాం జిల్లా పట్టపూర్ అటవీ ప్రాంతాల్లో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి తోటలను జిల్లా ఎక్సైజ్ విభాగం అధికారులు గురువారం ధ్వంసం చేశారు. ఎస్పీ జగమోహన్ మినన్ తెలిపిన వివరాల మేరకు.. పట్టపూర్ పోలీసుస్టేషన్ పరిధి కె.నువాగడా గ్రామ శివారులో సుమారు వంద ఎకరాల్లో సాగు చేస్తున్న సుమారు రూ.3 కోట్ల విలువ చేసే పంటను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. గంజాయి సాగు, అక్రమ రవాణాపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



గంజాయి చెట్లను తగలబెడుతున్న దృశ్యం

ఆస్తులు తెలియజేస్తేనే జీతాలు

భువనేశ్వర్: ఈనెల 31వ తేదీలోగా ఆస్తుల వివరాలను దాఖలు చేయాలని, లేదంటే ఫిబ్రవరి నుంచి జీతాలు నిలిపివేయనున్నట్లు వ్యవసాయ శాఖ సిబ్బందికి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ పాఢీ ఆ శాఖ ముఖ్య అధికారులకు సమాచారం అందజేశారు.

లారీల సమ్మె విరమణ

భువనేశ్వర్: ఒడిశా రాష్ట్ర ట్రక్ ఓనర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు బుధవారం రాత్రి నుంచి నిర్వహించాల్సిన సమ్మె నిర్ణయాన్ని వాయిదా వేసినట్లు సంఘం ప్రధాన కార్యదర్శి రవి నారాయణ శత్పతి గురువారం ప్రకటించారు. ఈనెల 9వ తేదీన రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉషా పాఢి అధ్యక్షతన లారీ యజమానుల సమస్యలపై ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ అరుణ్ బోత్రా, సంఘం అధ్యక్షుడు విభూతి ప్రసాద్ దాస్, ప్రధాన కార్యదర్శి రవి నారాయణ శత్పతి, కార్య నిర్వాహక అధ్యక్షుడు దిలీప్ కుమార్ పాణి, ఉపాధ్యక్షులు శివ ప్రసాద్ మిశ్రా, సుమంత్ కుమార్ బిస్వాల్ హాజరయ్యారు. సమావేశంలో రద్దు విధానం అమలులో కొన్ని మార్పుల ప్రతిపాదన, లారీ అద్దె సంబంధిత ఛార్జీల ప్రతిపాదనలపై త్వరగా నిర్ణయం తీసుకుంటామని రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హామీ ఇచ్చారు. దీంతో సమ్మె నిర్ణయాన్ని వాయిదా వేసినట్లు తెలియజేశారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు



పల్లెశ్రీ మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

- కలెక్టర్ లింగరాజ్ పండా
- పల్లెశ్రీ మేళా పోస్టర్ ఆవిష్కరణ

పర్లాకిమిడి: స్థానిక గజపతి స్టేడియంలో ఈనెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ లింగరాజ్ పండా సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో సన్నాహక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈనెల 23, 24 తేదీల్లో పరేడ్ గ్రౌండ్స్‌లో ఎన్‌సీసీ బాయ్స్ స్కౌట్స్ దళాలు ప్రాక్టీసు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. గణతంత్ర వేడుకల్లో ఉదయం 8 గంటలకు జాతీయ పతాకాన్ని ఎగురవేసేందుకు పోలీసుల దళాలు, ఇతర సిబ్బంది ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం పల్లెశ్రీ మేళా పోస్టర్‌ను కలెక్టర్ లింగరాజ్ పండా, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, ఏడీఎం సంగ్రాం శేఖర పండా తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అలోక్ కుమార్ ప్రధాన్, అదనపు నిర్వాహణ అధికారి జ్యోతిరాజ్ అధికారి, ఆర్‌ఐఎఫ్ పోలీసు దామోదర్ హోనగా, సబ్ డివిజనల్ పోలీసు అధికారి రామకృష్ణ పతి, డిప్యూటీ కలెక్టర్ నటబర గోరోడో, డీసీపీయూ అరుణ్ కుమార్ త్రిపాఠి, స్వయం ప్రతిపత్తి కళాశాల ప్రిన్సిపాల్ అజయ్ కుమార్ త్రిపాఠి, డీపీఆర్‌వో ప్రదిప్త గురుమయి, జిల్లా సాంస్కృతిక విభాగం అధికారి అర్చనా కుమారి మంగరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

• స్తంభించిన ట్రాఫిక్



జిల్లాలోని పొట్టంగి సమితి సుంకి సమీపం వద్ద ఆంధ్ర-ఒడిశా సరిహద్దులో గురువారం ట్రాఫిక్ స్తంభించింది. విశాఖపట్నం నుంచి ఛత్తీస్‌ఘడ్ వైపు ఒక భారీ బ్రాయిలర్ యంత్రంతో 28 చక్రాల లారీలో వెళ్తోంది. ఈ లారీ జాతీయ రహదారి ఘాట్ రోడ్డు మలుపు వద్ద ఒరిగిపోయింది. దీంతో భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, కొన్ని గంటల పాటు శ్రమించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

- కొరాపుట్

అటవీ కార్మికులకు 100 రోజుల పని దినాలు

- వాతావరణ మార్పు శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి మోనా శర్మ
- క్యాంపా స్టీరింగ్ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న సురేష్ చంద్ర మహాపాత్రో

భువనేశ్వర్: గ్రామ పంచాయతీ స్థాయిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అటవీ కార్మికులకు 100 రోజుల పని దినాలు కల్పించాలని అటవీ, పర్యావరణం, వాతావరణ మార్పు శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోనా శర్మ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సురేష్ చంద్ర మహాపాత్రో అధ్యక్షతన రాష్ట్ర క్యాంపా స్టీరింగ్ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో 2023–24 ఆర్థిక సంవత్సర వార్షిక కార్యాచరణ వ్యయ ప్రణాళిక ప్రతిపాదనకు కమిటీ ఆమోదించింది. క్యాంపా నిధులు ద్వారా విస్తృతంగా జరుగుతున్న వన్యప్రాణుల సంరక్షణ కార్యకలాపాలను పర్యవేక్షించాలని చీఫ్ సెక్రటరీ మోనా శర్మ సూచించారు. అడవుల పెంపకం కార్యక్రమాలను ప్రతీ ఆరు నెలలకు ఒకసారి క్యాంపా ట్రాకర్, ఉపగ్రహం పర్యవేక్షణ నివేదికలను క్షేత్ర స్థాయిలో సీనియర్ అధికారులు తరచుగా తనిఖీలు చేపట్టి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలన్నారు. అనుబంధ శాఖలు తరచూ సంయుక్తంగా సమావేశమై అటవీ రహదారిని గ్రేడ్-1 మెటలింగ్‌గా అప్‌గ్రేడ్ చేయడానికి పంచ వర్ష కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. కల్వర్టులు, కాజ్‌వే వంటి మెటీరియల్ ఇంటెన్సివ్ కాంపోనెంట్ ఖర్చుల కోసం క్యాంపా నిధులను వినియోగించేందుకు అనుమతించారు.

అభయారణ్య గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ

పులుల అభయారణ్యం పరిధిలోని గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మోనా శర్మ సూచించారు. అన్ని డివిజన్లలో వీహెచ్‌ఎఫ్ నెట్‌వర్కింగ్ మెరుగుదలకు ఆదేశించారు. జంతువుల దాడుల నివారణకు సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. చందక వన్య ప్రాణుల డివిజన్ పరిధి అన్ని రెవెన్యూ అటవీ ప్రాంతాల్లో ఏనుగు కారిడార్ అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం క్యాంపా కింద రూ.1,085.94 కోట్ల వ్యయ ప్రణాళికతో ప్రతిపాదించిన కార్యకలాపాల వార్షిక ప్రణాళిక (ఏపీవో) వివరాలను క్యాంపా రాష్ట్ర అథారిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రదీప్ రాజ్ కారత్ ప్రవేశపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదానికి ఈ ప్రతిపాదనలు పంపించాలని కమిటీ తీర్మానించింది. అడవుల్లో మంటల నియంత్రణ కోసం సమగ్ర ప్రణాళిక కార్యాచరణ కోసం జిల్లా కలెక్టర్లతో సంప్రదించిన మేరకు పబ్లిక్ డొమైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ చీఫ్ కంజర్వేటర్ ఆఫ్ ఫారెస్టు దేబిదుత్త బిస్వాల్, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ సుశీల్ కుమార్ పొప్లి, ప్రిన్సిపల్ చీఫ్ కంజర్వేటరు ఆఫ్ ఫారెస్ట్ (నోడల్ ఎఫ్‌సీఏ) సుకాంత నందా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యావసర వస్తువులతో మహిళలు

రాయగడ: స్థానిక రైతుల కాలనీలో ఉన్న నవజీవ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర వస్తువులను గురువారం పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వాహకురాలు ఎం.నళిని ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సంగీత ఉత్సవాలు



పాటలు ఆలపిస్తున్న కళాకారులు

బరంపురం: స్థానిక గిరి మార్కెట్ రోడ్డులో ఆంధ్ర భాషాభివర్ధనీ సమాజం సౌజన్యంతో త్యాగరాజు భక్త సమితి ఆధ్వర్యంలో సంగీత ఉత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు డా.ఈపరి జయంతిరావు, కోశాధికారి కేబీ కృష్ణప్రసాద్, వీవీ రవికుమార్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదా రంగనాథుల ఊరేగింపు



ఊరేగింపు నిర్వహిస్తున్న అర్చకులు

మందస: మందసలోని వాసుదేవ పెరుమాళ్ స్వామి సన్నిధిలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సంక్రాంతి సమీపిస్తుండటంతో ఆలయలంలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గురువారం గోదాదేవి, రంగనాథులను ఊరే గించారు. ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో ధనుర్మాస విశిష్టతను వివరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ నెల 14న గోదాదేవి, రంగనాథుల కల్యాణం నిర్వహించనున్నట్లు వేదపండితులు తెలిపారు. కార్యక్రమంలో సచ్చిదానందపాఢి, అనిల్‌స్వా మి, గణశ్యాం, ఆండాళ్లగోష్ఠి తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి నాటికి రీసర్వే పూర్తి కావాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో చేపడుతున్న రీసర్వే ఫిబ్రవరి నాటికి పూర్తికావాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి.సాయిప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు. రీసర్వేపై గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో 323 గ్రామాల్లో రీసర్వే పూర్తిచేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ ఇప్పటివరకు 36 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, మరో 206 గ్రామాల్లో డ్రోన్ సర్వే కూడా చేపట్టామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, భూసర్వే, రికార్డుల శాఖ సహా య సంచాలకులు కె.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

సొంత ఊరికి కొంత మేలు



రెంటికోటలో శ్రమదానం చేస్తున్న వలస ఉద్యోగ, కార్మికులు

కాశీబుగ్గ: ఉద్యోగ, వ్యాపార, ఉపాధి రీత్యా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా సంక్రాంతి సెలవులకు వచ్చి సొంతూళ్లపై మమకారం చూపుతున్నారు. పలాస మండలం రెంటికోట గ్రామంలో కోనేరులో పిచ్చిమొక్కలు, గుర్రపుడెక్కలు పేరుకుపోయి స్నానాలకు, మూగ జీవాలకు ఇబ్బందులు కలుగుతుందని గ్రహించిన యువకులు శ్రమదానం చేసి కోనేటిని శుభ్రం చేశారు.

వంతెనపై రక్షణ గోడను ఢీకొని వ్యక్తి మృతి

భోగాపురం: భోగాపురం జాతీయ రహదారి వంతె నపై రక్షణ గోడను ఢీకొని శ్రీకాకుళం జిల్లా జిసిగ డం మండలం బోతులపేట గ్రామానికి చెందిన మొయ్యి శ్రీనివాసరావు(40) గురువారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గుంటూరులో బ్రహ్మరి కోల్డ్ స్టోరేజ్‌లో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబంతో జీవనం సాగిస్తున్న శ్రీనివాస రావు సంక్రాంతి పండగ కోసం భార్య ముగ్గు రు పిల్లలను బుధవారం రైలులో పంపించి, తాను ద్విచక్ర వాహనంపై సొంత గ్రామానికి బయలు దేరాడు. ఈ క్రమంలో భోగాపురం జాతీయ రహదా రి వంతెనపైకి చేరుకునే సమయంలో బైక్ అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొట్టడంతో శ్రీనివాసరావు తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఎస్సై కృష్ణమూర్తి సంఘట నా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని 108 వాహనంలో సుందరపేట సీహెచ్‌సీ కి తరలించారు.

యువతకు ఆదర్శనీయుడు స్వామీ వివేకానంద



రాయగడ: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు



బరంపురం: యువజనోత్సవాల ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్, మేయర్ సంఘమిత్ర దొళాయి



కొరాపుట్: సమైక్య ప్రతిజ్ఞ చేస్తున్న యువత



జయపురం: మాట్లాడుతున్న సత్యభ్రత నందో

- ఘనంగా జాతీయ యువజనోత్సవాలు

బరంపురం:

నేటి యువతకు స్వామీ వివేకానందుడు ఆదర్శనీయుడని ఎమ్మెల్యే విక్రమ్ పండా, మేయర్ సంఘమిత్ర దొళాయి అన్నారు. స్థానిక ఎంకేసీజీ మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఐసీఆర్‌డీ, క్రాంతి సంస్థలతో పాటు వివిధ యువజన సంఘాల ఆధ్వర్యంలో స్వామీ వివేకనంద జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాజీ బీడీఏ చైర్మన్ సుభాష్ మహరణ, గంజాం బీజేడీ అధ్యక్షుడు చావ్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాయగడ: స్థానిక రింగ్ రోడ్డు సమీపంలోని వివేకానంద విద్యాలయంలో స్వామీ వివేకానంద జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలిపొందినవారికి రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, సమితి ఉపాధ్యక్షుడు హరప్రసాద్ హెప్రుక, గౌరవ అతిథి జేకే పేపర్ మిల్ పీఆర్వోల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

కొరాపుట్: జిల్లాకేంద్రంలో స్వామీ వివేకానంద జయంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక స్టేడియంలో యువత సమైక్య ప్రతిజ్ఞ చేశారు. అలాగే కొరాపుట్, నబరంగ్‌పూర్, సిమిలిగుడ, ఉమ్మర్ కోట్ పట్టణాల్లో సత్యసాయి సమితి సభ్యులు, సరస్వతీ విద్యా మందిర్ విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు.

జయపురం: స్థానిక కార్మిక భవనంలో స్వామీ వివేకానంద జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఛాత్ర సంఘటన అధ్యక్షుడు సత్యబ్రత నంద మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత సన్మార్గంలో నడవాలని సూచించారు. కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రమోద్‌కుమార్ మహంతి మాట్లాడుతూ... వివేకానందుని బోధనలు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందిని ఉత్తేజపరుస్తున్నాయన్నారు.

మినీ మారథాన్



పోటీలో పరుగుతీస్తున్న రుద్ర ప్రసాద్ శేఠి



పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

మల్కన్‌గిరి: జిల్లాకేంద్రంలో మాల్యావంత్ ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా 15 కిలోమీటర్ల మారథాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ పోటీలో కోరుకొండకు చెందిన ఆరేళ్ల రుద్రప్రసాద్ శేఠి 5వ స్థానంలో నిలిచి సత్తాచాటాడు. పోటీలను జిల్లా క్రీడాధికారి దుర్యోధన్ ముదిలి, డీపీఎం మిషన్ శక్తి అధ్యక్షుడు శల్యమోహన్ బార పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అలాగే సబ్ కలెక్టర్ అక్షయ్ కుమార్ ఖెముండు పోటీదారులను ప్రోత్సహించారు.

బాధ్యతల స్వీకరణ



ప్రమోద్‌కు అభినందనలు తెలియజేస్తున్న దృశ్యం

కొరాపుట్: ఒడిశా లిఫ్ట్ ఇరిగేషన్ సలహాదారుడుగా నబరంగ్‌పూర్ జిల్లాకి చెందిన ప్రమోద్ పాఢీ భువనేశ్వర్‌లో గురువారం బాధ్యతలు స్వీకరించారు. లిఫ్ట్ ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ అమ్రేష్ పత్రి ఈ బాధ్యతలను ప్రమోద్‌కి అప్పగించారు. అంతకుముందు ప్రమోద్‌ను కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల బీజేడీ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్ చంద్ర మజ్జి, కొరాపుట్ సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహీ, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధానీ, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారీ, ఝొరిగాం ఎమ్మెల్యే ప్రకాష్ చంద్ర మజ్జి, నబరంగ్‌పూర్ జిల్లా పరిషత్ అధ్యక్షుడు మెతిరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన యువజన సంబరాలు



యువజన ఉత్సవాల్లో డూడూ బసవన్నల విన్యాసం



గ్రామీణ మహిళ వేషధారణలో చిన్నారి



గిరిజన సంప్రదాయ నృత్యం



టెక్కలి: తప్పెటగుళ్ల కళాకారుల సందడి

టెక్కలి: స్వామి వివేకానందా జయంతిని పురస్కరించుకుని టెక్కలిలో ప్రజా చైతన్య కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన దినోత్సవ సంబరాలు అలరించాయి. చిన్నారుల వేషధారణలు, డూడూ బసవన్నల విన్యాసాలు, గిరిజన సంప్రదాయ నృత్యాలు, తప్పెటగుళ్లు, కోలాటం ప్రదర్శనలతో సందడి వాతావరణం నెలకొంది. ముందుగా కళా సమితి ప్రతినిధులు స్వామి వివేకానందా చిత్రపటానికి పూల మాలలు వేసి ఘననివాళులర్పించారు. డూడూ బసవన్నల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా.. చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అనంతరం వేషధారణలు వేసిన చిన్నారులు, కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రజా చైతన్య కళా సమితి సభ్యులు పాల్గొన్నారు.

దిమ్మిడిజోల పంచాయతీలో అవినీతిపై ఫిర్యాదు



ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందిగాం: మండలంలోని దిమ్మిడిజోల పంచాయతీలో జరుగుతున్న అవినీతిపై దర్యాప్తు చేయాలని స్థానిక నాయకులు గురువారం ఎంపీడీఓ హెచ్.వి.రమణమూర్తికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దిమ్మిడిజోల సర్పంచ్ సలాన దేవమ్మ స్థానికంగా ఉండకుండా హైదరాబాద్‌లో నివాసముంటున్నారని, బినామీగా ఉన్న సలాన కృష్ణారావు పంచాయతీ నిధులను పనులు చేయకుండానే డ్రా చేసుకుంటున్నారని ఆరోపించారు. కనీసం కాలువలు కూడా శుభ్రం చేయించకుండా తప్పుడు బిల్లులతో దోచేస్తున్నారని, గ్రామసభలు నిర్వహించకుండా తప్పుడు సంతకాలతో సుమారు రూ.20లక్షల అవినీతికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం బినామీగా ఉన్న కృష్ణారావు 2014–19 వరకు సర్పంచ్‌గా ఉంటూ నాటి మంత్రి అచ్చెన్నాయుడు అండదండలతో లక్షలాది రూపాయలు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. పంచాయతీలో జరిగిన అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైస్ ఎంపీపీ రేగల లక్ష్మీకాంతం, కూర్మారావు, మాజీ సర్పంచ్ కొల్లి శ్రీరాములు, సలాన ఈశ్వరరావు, కొల్లి బాలకృష్ణ, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఉత్కళాంధ్ర కబడ్డీ పోటీల విజేత శ్రీకాకుళం



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్ నర్తు రామారావు తదితరులు

కవిటి: మండలంలోని బొరివంకలో ఉద్దానం యూ త్ క్లబ్ ఆఫ్ బొరివంక ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్కళాంధ్ర కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం కేఆర్ స్టేడి యం జట్టు విజేతగా నిలిచింది. గురువారం జరిగిన ఫైనల్లో ఉద్దానం, శ్రీకాకుళం కేఆర్ స్టేడియం జట్లు హోరాహోరీగా తలపడటంతో తొలుత టైగా ముగి సింది. దీంతో అంపైర్లు మ్యాచ్‌లో చెరో ఐదు రైడర్లను పెంచగా శ్రీకాకుళం కేఆర్ స్టేడియం జట్టు ప్రథమస్థానం సాధించింది. ఉద్దానం, శ్రీకుమార్ హరిపురం, జిల్లుండ జట్లు తర్వాత స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామారావు, వైఎస్సార్ సీపీ నేత కడియాల ప్రకాష్, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, కృష్ణారావు, సర్పంచ్ శ్రీరాంప్రసాద్, ఎంపీటీసీ దుద్ది సతీష్, గెస్ట్ అధ్యక్షుడు బల్లెడ శంకరరావు, సంఘం అధ్యక్షుడు లొట్ల దీనబంధు, గౌరవాధ్యక్షుడు దుద్ది విజయగోపాలం బహుమతులు అందించారు.

ఉద్యోగాల పేరుతో మోసం

పొందూరు : ఉద్యోగం పేరుతో మోసం చేసి నగదు తీసుకుని తిరిగి ఇవ్వలేదని లక్ష్మీపేట గ్రామానికి చెందిన కోవెల నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. కిచెన్ గార్డెన్ ఉద్యోగం పేరుతో గవర్రాజు తన వద్ద నగదు తీసుకున్నారని నాగరాజు ఈ నెల 4న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు 420, 468 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



జాబ్‌మేళా వేదికపై ఉన్న అధికారులు, నాయకులు

- ఎంపీ చంద్రశేఖర సాహు



రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న యువత

పర్లాకిమిడి: జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ చంద్రశేఖర సాహు సూచించారు. స్థానిక గజపతి స్టేడియంలో జిల్లాస్థాయి జాబ్‌మేళాను గురువారం ప్రారంభించారు. జాబ్‌మేళాతో పదో తరగతి నుంచి డిగ్రీ, డిప్లొమో వరకు చదివిన యువతకు ఉద్యోగాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మేళాకు హెచ్‌సీఎల్, సెంచూరియన్ వర్సిటీ గ్రామతరంగ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, యూనియన్ బ్యాంక్ గ్రామీణ ఉపాధి శిక్షణ కేంద్రంతో పాటు 20 కంపెనీలు వచ్చాయి. కార్యక్రమంలో ఏడీఎం సంగ్రాం శేఖర పండా, జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ పి.కె. పాత్రో, గుమ్మా సమితి చైర్మన్ సునేమి మండళ్, డీసీపీయూ అరుణ్ కుమార్ త్రిపాఠి, జిల్లా ఉపాధి శాఖ అధికారి సౌభాగ్యముక్తి రంజన్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం




క్రీడా జ్యోతిని ఊరేగింపుగా తీసుకొస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న అనసూయ మాఝి తదితరులు

రాయగడ: స్థానిక మహిళా కళాశాలలో వార్షిక క్రీడా పోటీలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ముందుగా కళాశాల విద్యార్థులు స్థానిక డీఏవో కార్యాలయం సమీపంలో ఉన్న దుర్గా మండపం నుంచి క్రీడా జ్యోతిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం స్పెషల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ అనసూయ మాఝి జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అర్చన పట్నాయక్ మాట్లాడుతూ ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ ఏడాది సైతం పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. రెండు రోజులు పాటు పోటీలు జరుగుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల గవర్నింగ్ బాడీ అధ్యక్షుడు డాక్టర్ డీకే మహంతి, పియిటి రీణా మిశ్రా పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో సిక్కోలు హవా



పతకాలు సాధించిన సిక్కోలు మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడాకారులు వీరే

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు పూర్తి హవా కనబర్చారు. ఇటీవల గుంటూరు వేదికగా జరిగిన ఈ పోటీల్లో 18 మంది మాస్టర్ అథ్లెటిక్స్ ప్రాతినిధ్యం వహించగా 30 పతకాలు సాధించి శభాష్ అనిపించారు. ఇందులో 13 బంగారు, ఏడు రజత, మరో పది కాంస్య పతకాలు ఉండటం విశేషం. 70 ఏళ్ల పురుషుల విభాగంలో జి.జగన్నాథరావు, పి.మోహనరావు, 65 ఏళ్ల విభాగంలో జె.మధుసూదనరావు, 55 ఏళ్ల విభాగంలో జి.అర్జున్ రావురెడ్డి, 50 ఏళ్ల విభాగంలో టి.గంగాధర్‌రావు, జె.వి.ఎస్.జగన్నాథం, సీహెచ్.లక్ష్మణరావు, సీహెచ్.గణేశ్వర్, వై.కరుణ్‌కుమార్, మహిళల 70 ఏళ్ల విభాగంలో ఎం.డి.కళావతి, 50 ఏళ్ల విభాగంలో ఎం.స్వాతి, 45 ఏళ్ల విభాగంలో ఎస్.రమణాదేవి, జి.హైమావతి ఉన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులంతా హర్యానాలో ఫిబ్రవరి 19, 20 తేదీల్లో జరిగే జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని శ్రీకాకుళం జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ సంఘం చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, అధ్యక్షుడు ఎండీ ఖాసీంఖాన్, కార్యదర్శి జి.అర్జున్‌రావురెడ్డి తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రయాణికులకు వీలుగా పల్లెవెలుగు సర్వీసులు

- కొత్త బస్సులను ప్రారంభించిన జోనల్ చైర్మన్ గదల బంగారమ్మ



పల్లెవెలుగు బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న జోనల్ చైర్మన్ గదల బంగారమ్మ

విజయనగరం టౌన్: ప్రయాణికులకు వీలుగా నడుపుతున్న పల్లెవెలుగు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ విజయనగరం జోనల్ చైర్మన్ గదల బంగారమ్మ కోరారు. విజయనగరం డిపో పరిధిలో గురువారం రెండు ఆల్ట్రా పల్లెవెలుగు బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం, సుఖవంతమని తెలిపారు. విజయనగరం నుంచి పార్వతీపురం రూట్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులు నడుస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రజారవాణాధికారి కె.శ్రీనివాసరావు, జోనల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ అప్పలరాజు, డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ బి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

19న వైద్యాధికారి పోస్టులకు ఇంటర్వ్యూ

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఖాళీగా ఉన్న 10 వైద్యాధికారి పోస్టులకు ఈ నెల 19వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహిస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణ కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో -3, ఎన్‌బీఎస్‌యూలో-3, ఆర్‌బీఎస్‌కేలో-1, టెలీహబ్‌లో-3 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హతగల అభ్యర్థులు ఒరిజనల్, జెరాక్సు ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. గుర్తింపు పొందిన విశ్వ విద్యాలయం నుంచి ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు ఏపీ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ అయిన అభ్యర్థులు అర్హులని చెప్పారు.

స్కూల్ అసిస్టెంట్లుగా ఎస్జీటీలు



డీఈఓ కార్యాలయంలో సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు

విజయనగరం పూల్‌బాగ్: హైస్కూళ్లు, ఇతర ప్రీ హైస్కూళ్లలో 3వ తరగతి నుంచి సబ్జెక్టు టీచర్లతో బోధన చేయించేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. నూతన విద్యావిధానంలో స్కూళ్లలో 3వ తరగతి నుంచి సబ్జెక్టుల బోధనకు సీనియర్ సెకండరీ టీచర్ల (ఎస్జీటీలు)కు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి ఇవ్వాలని భావించింది. దీనికోసం డీఈఓ కార్యాలయంలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించింది. మొత్తం 110 పోస్టులకు 100 మంది హాజరయ్యారు. కోర్టు కేసులు పరిష్కారమై, వీరికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతిలిచ్చే వరకు సబ్జెక్టు బోధన చేస్తారు. దీనికోసం నెలకు రూ.2500 చొప్పున సబ్జెక్టు టీచర్ అలవెన్సు ఇస్తారు.

కేటుగాళ్ల అరెస్టు

చీపురుపల్లి: ప్రజల ఖాతాల్లో నగదు కాజేస్తున్న సైబర్ నేరగాళ్లను అరెస్టుచేసినట్టు చీపురుపల్లి సీఐ జి.సంజీవరావు తెలిపారు. చీపురుపల్లి సర్కిల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. గుర్ల మండలం లవిడాం గ్రామానికి చెందిన రౌతు పూర్ణచంద్రరావు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి సుమారు రూ.7లక్షలు పోగొట్టుకున్నాడు. దీనిపై గత ఏడాది జూన్‌లో గుర్ల పోలీస్ స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తుచేసిన పోలీసులు పశ్చిమబెంగాల్‌లో ఉంటూ బీహార్ రాష్ట్రానికి చెందిన ఎ.దిప్పుకుమార్, మోహన్ కుమార్‌రావు నేరాలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. వీరిని చీపురుపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఆరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.4లక్షల నగదు, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, చెక్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంతో ప్రతిభ చూపిన గుర్ల ఎస్‌ఐ శిరీష, చీపురుపల్లి ఎస్‌ఐ సన్యాసినాయుడు, గరివిడి ఎస్‌ఐ, కానిస్టేబుళ్లను ఆయన అభినందించారు.

వృద్ధుడి అదృశ్యం

విజయనగరం క్రైమ్: విశాఖ జిల్లా పెందుర్తి శ్రీనివాసనగర్‌కు చెందిన తన మామయ్య చిన్ని అప్పలస్వామి కనిపించడం లేదని కోడలు సునీత పెందుర్తి పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి శ్రీనివాసనగర్‌కు చెందిన 72 ఏళ్ల వయసున్న చిన్ని అప్పలస్వామి డిసెంబరు 29న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో వారికి తెలిసిన అన్ని చోట్లా వెతికారు. అయినప్పటికీ ఫలితం కనిపించక పోవడంతో కోడలు సునీత పోలీసులను ఆశ్రయించింది. అదృశ్యమైన వృద్ధుడు విజయనగరం జిల్లా కేంద్రం పరిసరాల్లో ఉన్నట్లు సమాచారం ఉందని ఆచూకీ తెలిసిన వారు 9100604665, 6300289742 నంబర్లను సంప్రదించాలని పెందుర్తి పోలీసులు కోరారు.

ఉగాదికి.. కొత్త ఊళ్లు



విజయనగరం మండలంలోని నారాయణపురం లేఅవుట్ జగనన్న కాలనీల్లో నిర్మాణంలో ఇళ్లు

ఇది రాష్ట్రంలోని అతి పెద్ద జగనన్న కాలనీల్లో ఒకటైన విజయనగరం శివారు గుంకలాం లేఅవుట్‌లోని నిర్మాణ పనులు పూర్తి అయిన ఇల్లు. ఇదొకటి కాదు ఇలా జిల్లాలో 34,505 ఇళ్లలో ఆయా లబ్ధిదారులతో తెలుగు సంవత్సరాది ఉగాది రోజున గృహప్రవేశం చేయించాలనేది ఇప్పుడు అధికారుల లక్ష్యం. తద్వారా ఏవో కొన్ని ఇళ్లున్న కాలనీ కాదు ఏకంగా కొత్త ఊళ్లు జిల్లా పటంలోకి రానున్నాయి.



- మార్చి 22న 34,505 గృహప్రవేశాలే లక్ష్యం
- జగనన్న కాలనీల్లో చురుగ్గా నిర్మాణాలు
- రూ.కోట్ల నిధులతో మౌలిక వసతుల కల్పన
- లబ్ధిదారులకు అడుగడుగునా ప్రభుత్వ సహకారం
- ఉగాది నాటికల్లా సొంతిల్లు కల సాకారం

ఒక్కో ఇంటికి సర్కారు సామగ్రి...

సిమెంటు	:	90 బస్తాలు
ఇసుక	:	20 టన్నులు
ఇనుము	:	347347 కిలోలు

ఇతర సామగ్రి :
సిమెంటు ద్వారబంధాలు, తలుపులు, కిటికీలు, కిటికీ రెక్కలు, ఎలక్ట్రికల్ సామాన్లు, స్టీల్ యాంగ్యులర్లు, పెయింట్స్, పైకప్పు రేకులు, టాయిలెట్ తలుపులు, వాటర్ స్టోరేజ్ ట్యాంకు, శానిటరీ ఐటమ్స్, సున్నం, వ్రిల్ ఆర్ట్స్



తెర్లాం మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో చురుగ్గా ఇళ్ల నిర్మాణ పనులు

గృహనిర్మాణ శాఖ ద్వారా మౌలిక వసతుల కల్పనకు ఖర్చు...

- నీటి సరఫరా : 1075 బోర్ల కోసం రూ.46.09 కోట్లు
- అప్రోచ్ రోడ్లు : రూ.6.59 కోట్లు
- అంతర్గత రహదారులు : రూ.45 లక్షలు
- భూమిని చదును చేయడానికి : రూ.2.34 కోట్లు
- తాత్కాలిక షెడ్ల నిర్మాణం : రూ.6 లక్షలు
- సిమెంట్ గోదాములు : రూ.25 లక్షలు
- కల్వర్టులు, వంతెనలు : రూ.46 లక్షలు
- రహదారులు : రూ. 2.01 కోట్లు
- సోలార్ విద్యుత్ దీపాలు : రూ.2.64 కోట్లు
- విద్యుత్ సరఫరా : రూ.101.33 కోట్లు

జేజేఎం పథకం కింద తాగునీటి సరఫరాకు ప్రతిపాదనలు...

మొత్తం పనులు	734
అంచనా వ్యయం	రూ.138.81 కోట్లు
జరుగుతున్న పనులు	171
టెండరు దశలో ఉన్నవి	264
ఎఫ్‌టీసీలు ఇచ్చినవి	337

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

సొంతిల్లు అనేది పేద, సామాన్య కుటుంబాలకు ఓ కల! ఇన్నాళ్లకు అది కార్యరూపం దాల్చుతోంది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఉగాది నాటికి పేదలకల నెరవేరుతోంది. పేదలందరికీ సొంత ఇల్లు ఇస్తానన్న హామీని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పక్కాగా అమలుచేస్తున్నారు. మార్చి 22న ఉమ్మడిజిల్లాలో 34,505 కుటుంబాలతో గృహ ప్రవేశాలు నిర్వహించాలని ప్రభుత్వం జిల్లా అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించింది. వాటిలో ఇప్పటికే 18,320 ఇళ్లు పూర్తి స్థాయిలో సిద్ధమయ్యాయి. మరో 16,185 ఇళ్ల నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. అడుగడుగునా ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ సహకారంతో తమ చిరకాల స్వప్నాన్ని నెరవేర్చుకునే దిశగా లబ్ధిదారులు అడుగులు వేస్తున్నారు.

నవరత్నాల్లో భాగం ఇల్లు...

నవరత్నాలు అమలులో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించిన 'పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమం ఇల్లులేని పేదలపాలిట వరమైంది. ప్రభుత్వమే స్థలాన్ని కొనిచ్చి అందులో అన్ని వసతులనూ సమకూర్చుతోంది. ఇంటి నిర్మాణానికి ఆర్థికంగా కూడా సహకారాన్ని అందిస్తోంది. దీంతో లబ్ధిదారులంతా తమ ఇళ్ల నిర్మాణ పనుల్లో నిమగ్నమయ్యారు.

ఉగాది నాడు సామూహిక గృహప్రవేశాలు...

జిల్లాలో మొత్తం 77,205 ఇళ్లు మంజూరయ్యాయి. 651 లేఅవుట్లలో 36,631 ఇళ్లు, వ్యక్తిగత ఇళ్లు 40,574 ఉన్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ముహూర్తం మార్చి 22న ఉగాది నాడు జిల్లాలో మొత్తం 34,505 ఇళ్లలో సామూహిక గృహప్రవేశాలు చేయించేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. వీటిలో ఇప్పటికే 18,320 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మరో 16,185 ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఉగాదికి ఇంకో రెండు నెలలు గడువు ఉండడంతో ఇవన్నీ ఆలోగా పూర్తి చేయడానికి లబ్ధిదారులు నిర్మాణ పనులు చేసుకుంటున్నారు. ఈ పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షల చొప్పున లబ్ధిదారులకు ప్రోత్సాహకంగా అందిస్తోంది. డ్వాక్రా మహిళలకు అదనంగా రూ.35 వేలను రుణంగా మంజూరు చేయిస్తోంది.

మౌలిక వసతులకు పెద్దపీట...

ఇళ్లు కాదు... ఊళ్లు నిర్మిస్తున్నామన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాటలకు అనుగుణంగా జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన నీరు, విద్యుత్‌తో పాటు అంతర్గత రహదారులను యుద్ధప్రాతిపదికన నిర్మిస్తోంది. శాశ్వత ప్రాతిపదికన మౌలిక వసతుల కల్పన జరుగుతోంది. ముందుగా ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి అనుగుణంగా బోర్లు తవ్వకం, తాత్కాలిక విద్యుత్ సరఫరా కోసం స్తంభాలు ఏర్పాటు, అడ్డంగా ఉన్న స్తంభాలను పక్కకు జరపడం, అంతర్గత గ్రావెల్ రోడ్లు, అప్రోచ్ రోడ్ల నిర్మాణం తదితర వాటికోసం గృహ నిర్మాణ శాఖ ద్వారా సుమారు రూ.162.22 కోట్లు ఖర్చు చేశారు. విద్యుత్ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, డ్వామా, మున్సిపాల్టీలు, పబ్లిక్ హెల్త్, పంచాయతీ రాజ్ తదితర శాఖలు కోట్లాది రూపాయలను ఖర్చు చేసి మౌలిక వసతులను కల్పించాయి. లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం చివరిదశకు చేరుకోవడంతో శాశ్వత ప్రాతిపదికన విద్యుత్ లైన్లు, వీధి దీపాలు, ఇంటింటికీ తాగునీరు, రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. పలు కాలనీల్లో ఇప్పటికే విద్యుత్ సదుపాయం, జలజీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ తాగునీటి సరఫరా పనులు ప్రారంభమయ్యాయి.

జగనన్న కాలనీల్లో విద్యుత్ సరఫరాకు ప్రతిపాదనలు...

సబ్‌డివిజన్	అంచనా
విజయనగరం, చీపురుపల్లి, భోగాపురం	రూ.80.71 కోట్లు
బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం	రూ.80.94 కోట్లు
ఎస్.కోట, గజపతినగరం	రూ.70.17 కోట్లు
గుంకలాం మెగా లేఅవుట్	రూ.18.16 కోట్లు

జిల్లాలో జగనన్న గృహనిర్మాణ ప్రగతి

- జిల్లాలో మంజూరు చేసిన ఇళ్లు : 77,205
- 651 లేఅవుట్లలో మంజూరైన ఇళ్లు : 33,631
- సొంత స్థలాల్లో మంజూరు చేసిన ఇళ్లు : 40,574
- నిర్మాణం కోసం 1, 2 ఆప్షన్లు ఇచ్చిన లబ్ధిదారుల సంఖ్య : 67,075
- నిర్మాణం కోసం 3వ ఆప్షన్ ఇచ్చిన లబ్ధిదారుల సంఖ్య : 10,130
- ఇప్పటివరకు నిర్మాణం పూర్తి అయిన ఇళ్లు : 18,320
- నిర్మాణం పనులు పూర్తి చేయాల్సిన ఇళ్లు : 16,185
- ఉగాది నాడు సామూహిక గృహప్రవేశాల లక్ష్యం : 34,505

13 రకాల ఇంటి సామగ్రి సరఫరా....

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అడుగడుగునా ప్రోత్సాహాన్ని అందిస్తోంది. ప్రతీ లబ్ధిదారుడికి సుమారు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల విలువైన స్థలాన్ని ఉచితంగా ఇచ్చింది. 651 లే అవుట్లలో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. ఇళ్లను ఎలాగైనా పూర్తి చేయాలన్న లక్ష్యంతో నిర్మాణానికి కావాల్సిన ఇసుకను లేఅవుట్ వద్దకే ఉచితంగా సరఫరా చేయిస్తోంది. సిమెంటు, ఇనుము కూడా అక్కడే తక్కువ ధరకు అధికారులు అందజేస్తున్నారు. ఇవికాకుండా అవసరమైన వారికి సిమెంట్ ద్వారబంధాలు, తలుపులు, కిటికీలు, కిటికీ రెక్కలు, ఎలక్ట్రికల్ సామాన్లు, స్టీల్ యాంగ్యులర్స్, పెయింట్స్, పైకప్పు రేకులు, టాయిలెట్ తలుపులు, వాటర్ స్టోరేజ్ ట్యాంకు, శానిటరీ ఐటమ్స్, సున్నం, వ్రిల్‌ఆర్ట్స్ తదితర 13 రకాల సామగ్రిని తక్కువ ధరకు అందుబాటులో ఉంచడం విశేషం. ఇప్పటివరకు సుమారు 80,010 మెట్రిక్ టన్నుల ఇసుకను, 13,14,541 సిమెంటు బస్తాలను, 12,81,101 కిలోల ఇనుము లబ్ధిదారులకు అందజేశారు. ఇతర 13 రకాల సామగ్రిలో 9,848 వస్తువులను అందజేశారు.



శృంగవరపుకోట మండలంలోని పుణ్యగిరి లేఅవుట్ జగనన్న కాలనీలో రూపుదాల్చుతున్న ఇళ్లు

వివేకానందుని జీవితం యువతకు మార్గదర్శకం

- జాతీయ యువజన దినోత్సవంలో కలెక్టర్ సూర్యకుమారి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం: స్వామి వివేకానంద జీవితం యువతకు మార్గదర్శకమని కలెక్టర్ ఎ.సూర్యకుమారి అన్నారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని నెహ్రూ యువ కేంద్రం, సెట్విజ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్ కళాశాల వసతిగృహం మైదానంలో గురువారం నిర్వహించిన వివేకానందుని జయంతి వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివేకానంద చిత్రపటానికి పూలమాలలువేసి అంజలి ఘటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యువత దేశానికి వెన్నెముకగా నిలవాలని, చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా మంచి అలవాట్లతో దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని కోరారు. ఉన్నత స్థాయిలో స్థిరపడి తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో సెట్విజ్ సీఈఓ ఎస్‌వీకె దుర్గాప్రసాద్, నెహ్రూ యువ కేంద్రం కో ఆర్డినేటర్ విక్రమాదిత్య, 13(ఎ) బెటాలియన్ కల్నల్ ఎంకె ఆంటోని, సెట్విజ్ మేనేజర్ కేవీఎస్ఎన్ మూర్తి, ఎన్ఎస్ఎస్ అధికారులు/కేడిట్స్ పాల్గొన్నారు.

మురిపించిన ముగ్గులు



శిల్పారామంలో రంగవల్లుల పోటీల్లో పాల్గొన్న అతివలు



ఆనందగజపతి ఆడిటోరియంలో ముగ్గులు వేస్తున్న మహిళలు

విజయనగరం టౌన్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా శిల్పారామంలో జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముచ్చటైన ముగ్గులతో మురిపించారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను ఆర్డీఓ సూర్యకళ, డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు, జిల్లా పర్యాటక అధికారి లక్ష్మీనారాయణ, ఐఅండ్‌పీఆర్ ఏడీ రమేష్ తదితరులు పర్యవేక్షించారు. విజేతలకు శుక్రవారం నిర్వహించే సంక్రాంతి సంబరాల్లో బహుమతులు ప్రదానం చేయనున్నారు.
– స్థానిక ఆనందగజపతి ఆడిటోరియం ఆవరణలో వాజీ చానల్ ముగ్గుల పోటీలు నిర్వహించింది. పలువురు మహిళలు తమ సృజనకు పదును పెట్టారు. ముగ్గులతో చూపరులను ముగ్ధులను చేశారు. ముగ్గుల పోటీలతో సంక్రాంతి పండగ ముందుగానే వచ్చేసిందని టీవీ, సినీనటి జ్యోతిరాయ్ (గుప్పెడంత మనసు ఫేమ్ జగతి) పేర్కొన్నారు. 27 ఏళ్లుగా సంప్రదాయ బద్ధంగా రంగోలీ పోటీలు నిర్వహిస్తున్నట్టు వాజీచానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు తెలిపారు.

శాప్ లీగ్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికలు పూర్తి



శాప్ లీగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగన్న శాప్ లీగ్ షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు గురువారం పూర్తయ్యాయి. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పి.అప్పలనాయుడు ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ క్రీడామైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా..అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది క్రీడాకారులు అండర్-17 విభాగంలో..మరో 12 మంది క్రీడాకారులు అండర్-21 విభాగంలో ఎంపిక చేసినట్లు చీఫ్ కోచ్ అప్పలనాయుడు తెలిపారు. అండర్-17 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు బాపట్లలో, అండర్-21 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి లీగ్‌పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఎంపిక పోటీలను జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదరి ఇ.కృష్ణమూర్తి, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

పల్లె పండగ.. పిలుస్తోంది నిండుగ

- పండగ సెలవులతో స్వగ్రామాలకు ప్రయాణం
- వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు జోరుగా రాకపోకలు
- సంక్రాంతి పర్వదినానికి ముస్తాబవుతున్న పల్లెలు
- అతిథులకు స్వాగతిమిస్తున్న గ్రామీణ ప్రాంతాలు



విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సుల కోసం వేచిఉన్న ప్రయాణికులు



సొంత గూటికి ప్రయాణిస్తున్న యువత

విజయనగరం: సంక్రాంతి... తెలుగు ప్రజల పెద్దపండగ. ఇంటిల్లిపాదికి ఇష్టమైన పండగ. రంగవల్లులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దుల ఆటలు, పిండి వంటకాలు, అయ్యగారికి వందనం.. అమ్మగారికి చందనమంటూ డూడూ బసవన్న దీవెనలు.. వేకువజామున జంగమదేవరలు మోగించే గంటలు.. బుడబుక్కలి వాయించే ఢమరుక నాదాలు.. బడాయి పోతూ నాకేం తక్కువంటూనే మామూళ్లడిగే పిట్టలదొరలు.. చమత్కారాలతో చిందులేస్తూ ఎంతోకొంత సమర్పించుకుంటే కానీ కదలని కొమ్మదాసరులు.. ఇలా చెప్పుకొంటే పోతే పెద్ద జాబితాయే పెద్ద పండగది. సంక్రాంతి సంబరానికి పల్లెలు ముస్తాబవుతున్నాయి. దూరప్రాంతాల వారి రాకతో కొత్తశోభను సంతరించుకుంటున్నాయి. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో పల్లెలకు చేరుకునేవారి సంఖ్య ఒకసారిగా పెరిగింది. రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్లు రద్దీగా మారాయి.

ప్రతి ఇంటా ప్రత్యేక వంట

సంక్రాంతికి ప్రత్యేక వంటలు పల్లెల్లో ప్రసిద్ధి. అరిసెలు, పాకుండలు, సున్నుండలు, జంతికలు, కారంబూందీ, కారంపూస, బొబ్బట్లు వంటి వంటకాలు సంక్రాంతిలో ప్రత్యేకం. స్వచ్ఛమైన నేతితో, అచ్చమైన బెల్లంతో చేసే సున్నుండలు మరీ ప్రధానమైనవి. భోగిరోజున భోగి మంటలో కాల్చిన వంకాయలతో చేసిన పచ్చడి, మకర సంక్రాంతి నాడు పులిహోర, గారెలు, పాయసం, కనుమకు గ్రామదేవతలకు సమర్పించే నైవేద్యాల్లో మాంసాహార వంటకాలు ప్రధానమైనవి. ఇవిగాకుండా ఇష్టాలనుబట్టి తయారుచేసుకునే దద్దోజనం, పొంగలి వంటివి అతిథులకు ప్రత్యేక వంటకాలు.

కొత్త అల్లుళ్లకు మర్యాదలే వేరు..

కొత్త అల్లుళ్లకు సంక్రాంతి కానుకగా ద్విచక్రవాహనాలు ఇవ్వడం జిల్లాలో ఆనవాయితీ. ఆ ఏర్పాట్లలో మామయ్యలు మునిగి తేలుతున్నారు. ఇదిగాకుండా ఇంటికొచ్చిన బంధుమిత్రులకు నూతన దుస్తులు పెట్టడం సంస్కృతిగా వస్తోంది. వస్త్ర దుకాణాల్లో ఇటువంటి సందడే కనిపిస్తోంది. పల్లెల్లో పిల్లలైతే వేకువజామున లేచి ఆవుపేడకోసం పోటీ పడుతుంటారు. పేడను ఇంటికి శ్రద్ధగా తెచ్చి గోడకు భోగి పిడకలు వేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ విధంగా పిడకలను వెన్నముద్ద, తమలపాకు, అరటిపండులాంటి ఆకారాలతో వేయడం సంప్రదాయం. ఎండిన పిడకలను దండగా గుచ్చి భోగిమంటకు సిద్ధంచేస్తున్నారు.

పందెం రాయళ్లకు పండగే.. పండగ

సంక్రాంతి పండగ నేపథ్యంలో పందెం రాయళ్ల హడావిడి అంతా ఇంతా కాదు. మూడు రోజుల పాటు గ్రామాల్లో ప్రత్యేకశిబిరాలు ఏర్పాటు చేసుకుని మరీ జూదమాడేందుకు ఏర్పాట్లు చేసుకుంటారు. జూదంతో పాటు కోడి పందాలు జిల్లాలో జోరుగా సాగుతాయి. దీనికోసం ప్రత్యేకంగా సిద్ధంచేసిన వివిధ జాతు కోళ్లు బరిలోకి దిగేందుకు కాళ్లు రువ్వుతున్నాయి.

ఎన్నోముచ్చట్లు..

- చిన్ననాటి బాల్య స్నేహితులంతా స్వగ్రామాలకు వస్తుంటారు. అంతా ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకునే సదావకాశం సంక్రాంతి ఇస్తుంది.
- కుటుంబంలో తరతరాలుగా ఉన్నవారంతా ఒకచోట చేరి కుటుంబాల పండగ నిర్వహించుకున్న సందర్భాలు సంక్రాంతిలో ఉంటున్నాయి.
- పూర్వ విద్యార్థులందరూ కలిసేందుకు సంక్రాంతి ఒక వేదిక.
- పిల్లలకు ఇష్టమైన బొమ్మల కొలువు సంక్రాంతి ప్రత్యేకత. సంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు బొమ్మల కొలువు వద్ద చేసే సందడి అంతా ఇంతాకాదు.
- సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీల వంటివి పల్లెల్లో ప్రత్యేకంగా నిలుస్తాయి.
- కొన్నిచోట్ల చూస్తే కళాకారులకు సత్కారాలు నిర్వహించి సంప్రదాయాన్ని కాపాడుతున్నందుకు కతజ్ఞతలు తెలియజేస్తారు.
- స్నేహితులతో కలిసి స్వీయచిత్రం దిగాలంటే చరవాణి తెర పట్టనంతగా ఉంటుంది సంక్రాంతి సందర్భం.
- సంక్రాంతి సందర్భంగా సంప్రదాయ వేషధారణలు చిన్నారులకు పరిచయం చేయాలి. రోజు ఆధునిక దుస్తుల్లో విసిగిపోయినవారికి ఊరటగా ఉంటుంది.

స్టాంప్ వెండర్లపై విజిలెన్స్ తనిఖీ



స్టాంపుల విక్రయ కేంద్రం వద్ద వివరాలు తెలియజేస్తున్న విజిలెన్స్, రెవెన్యూ సిబ్బంది

విజయనగరం క్రైమ్: రాష్ట్రవ్యాప్తంగా స్టాంప్ పేపర్ అమ్మకం దారులపై విజిలెన్స్ శాఖ నిర్వహించిన తనిఖీల్లో భాగంగా శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా అమలు అధికారి ఎ.సురేష్‌బాబు ఆదేశాలతో గురువారం జిల్లా కేంద్రంలో పలువురు లైసెన్స్‌డ్ స్టాంప్ వెండర్లను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా కొంతమంది వెండర్లు నిర్దేశిత ముఖ విలువ కన్నా, అధిక ధరకు స్టాంప్ పేపర్లను అమ్ముతున్నట్లు గుర్తించి సంబంధిత అమ్మకందారులపై చర్యలకు సిఫార్సు చేశారు. దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సింహాచలం, హెచ్‌సీ అప్పన్న, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పాలకొండలో..

పాలకొండ రూరల్: విజిలెన్స్ ఎస్పీ సురేష్‌బాబు ఆదేశాలతో సిబ్బంది గురువారం పాలకొండలో తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా రిజిస్ట్రేషన్లతో పాటు క్రయవిక్రయాలకు సంబంధించి అవసరమైన స్టాంప్ పేపర్ల విక్రయ కేంద్రాలు లక్ష్యంగా తనిఖీలు చేపట్టినట్లు విజిలెన్స్ ఎస్సై రామారావు తెలిపారు. నగర పంచాయతీ పరిధి పోస్టాఫీస్ రహదారిలో బి. షణ్ముఖరావు దుకాణంలో స్టాంప్ పేపర్ల విక్రయాల కు సంబంధించి నిర్ణీత ధర కంటే అదనంగా రూ.10 నుంచి రూ.20 వరకు వసూలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విజిలెన్స్ ఎస్సైతో పాటు సిబ్బంది ఉమామహేశ్వరరావు, లక్ష్మీనారాయణ, స్థానిక రెవెన్యూ సిబ్బంది బలివాడ సాయి, పి.రమేష్ తదితరులు దాడుల్లో పాల్గొన్నారు.